VC NEWS
# వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...
TELUGU DAILY NEWS
www.veguchukkanews.com
నిజామాబాద్ బుధవారం 01 ఏప్రిల్ 2026
వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:03 సంచిక: 232
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


దద్దరిల్లిన ఇస్ఫహాన్



# అమెరికా గడ్డపై కేటీఆర్ గళం

## ఏప్రిల్ 4న న్యూయార్క్‌లోని కొలంబియా యూనివర్సిటీలో కేటీఆర్ ప్రసంగం

- ఇండియాస్ రైజ్' అనే టాపిక్‌పై అంతర్జాతీయ వేదికపై విశ్లేషణ
- 21 ఏళ్లుగా నిర్వహిస్తున్న 'ఎస్ఏబీఏ' సదస్సుకు ప్రత్యేక ఆహ్వానం
- గతంలో హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్ వంటి టాప్ వర్సిటీల్లో కేటీఆర్ ప్రసంగాలు
- టీ-హబ్, స్టార్టప్ విప్లవంపై గతంలో విదేశీ వేదికలపై చర్చ
- సుస్థిర అభివృద్ధిపై కేటీఆర్ విజన్‌కు దక్కుతున్న గ్లోబల్ గౌరవం

*భారతీయ వ్యాపార వ్యూహాలు, అంతర్జాతీయ స్థాయి ప్రాధాన్యతలపై చర్చించేందుకు సిద్ధమవుతున్న తరుణంలో భారత్ నుంచి కీలక గళం వినిపించబోతోంది. బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావుకు అమెరికాలోని ప్రముఖ కొలంబియా యూనివర్సిటీ నుంచి అరుదైన ఆహ్వానం దక్కింది. న్యూయార్క్ నగర వేదికగా ఏప్రిల్ 4న జరగనున్న అత్యున్నత స్థాయి సదస్సులో ఆయన ప్రసంగించనున్నారు. 'ది న్యూ ఇండియా ప్లేబుక్' అనే ప్రధాన ఇతివృత్తంతో సాగే ఈ కార్యక్రమంలో భారతీయ వాణిజ్య రంగాలు అనుసరిస్తున్న వ్యూహాలు, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై మేధోమథనం జరగనుంది.*

**హైదరాబాద్:** ఆయనకు గత జనవరి నెలలోనే ఆహ్వాన పత్రం అందింది. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన విద్యావేత్తలు, పారిశ్రామిక దిగ్గజాల సమక్షంలో ఆయన తన అభిప్రాయాలను పంచుకోనున్నారు. ఈ సదస్సులో భాగంగా 'ఇండియాస్ రైజ్: రీరైటింగ్ ది గ్లోబల్ బిజినెస్ ప్లేబుక్' అనే ప్రత్యేక అంశంపై కేటీఆర్ ప్రసంగం కొనసాగనుంది. వచ్చే శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు సాగే ఈ సెషన్‌లో ప్రపంచ వాణిజ్య యవనికపై భారత్ ఎదుగుతున్న తీరును ఆయన విశ్లేషించనున్నారు. కొలంబియా యూనివర్సిటీకి చెందిన విద్యార్థి విభాగం 'సౌత్ ఆసియా బిజినెస్ అసోసియేషన్'

మిగతా 2లో



# ఏపీ సర్కార్ వెనక్కి తగ్గాల్సిందే!

- నిబంధనలు మీరి విద్యుత్ తీయడంపై జూపల్లి ఫైర్
- తాము నిరసన ప్రకటించగానే ఏపీ ఉత్పత్తి ఆపేసింది
- 834 అడుగుల కంటే తక్కువ ఉంటే విద్యుత్ తీయొద్దు
- పాలమూరు రైతులకు నష్టం కలిగితే ఊరుకోం
- లంగాణ నీటి వాటా విషయంలో తగ్గేదే లేదు
- అక్రమంగా నీటిని తోడేస్తే హైకోర్టుకు వెళ్తాం

2

*శ్రీశైలం జలాశయం వేదికగా తెలుగు రాష్ట్రాల మధ్య నీటి పంపకాలు, విద్యుత్ ఉత్పత్తి అంశం మరోసారి రాజకీయ సెగలు రేపుతోంది. నిబంధనలకు విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీశైలంలో విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని, తమ హెచ్చరికల నేపథ్యంలోనే ప్రస్తుతానికి ఆ ప్రక్రియను నిలిపివేసిందని మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు.*

### కమలనాథుల గొంతులో

# హస్తం స్వరం

- కాళేశ్వరం పొలాల్లోకి దమ్ముంటే రండి - హరీశ్ సవాల్
- కాంగ్రెస్, బీజేపీ ఒక్కటై బీఆర్ఎస్‌పై బురదజల్లుతున్నాయి
- గతంలో మెచ్చుకున్న కేంద్రమే ఇప్పుడు విమర్శిస్తోంది
- పేరు వస్తుందనే ప్రాజెక్టుకు నిధులు ఆపేశారు
- కేరళ ప్రచారం కోసం అసెంబ్లీని ముగించారు
- బడ్జెట్ డొల్ల కాబట్టే కాపీలు చింపాము

2

*తెలంగాణ జీవనాడి కాళేశ్వరం ప్రాజెక్టుపై కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీ.ఆర్. పాటిల్ రాజ్యసభ వేదికగా చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చిచ్చు రేపాయి. లక్ష కోట్ల ప్రజాధనం వృథా అయ్యిందంటూ కేంద్ర మంత్రి చేసిన ఆరోపణలపై బీఆర్ఎస్ కీలక నేత, మాజీ మంత్రి హరీశ్ రావు నిప్పులు చెరిగారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వేదికగా మాట్లాడిన ఆయన, బీఆర్ఎస్ ప్రభుత్వంపై బురదజల్లే విషయంలో కాంగ్రెస్, బీజేపీలు ఒక్కటయ్యాయని విమర్శించారు.*



# ఆంధ్రాకు నీళ్లొదిలి కాంగ్రెస్ డ్రామాలు

- ఏపీ అక్రమంగా నీటిని తరలిస్తుంటే రేవంత్ సర్కార్ మౌనం
- ఏపీ సీఎంకు నీటిని ధారపోస్తూ రేవంత్ గురుదక్షిణ ఇస్తున్నారు
- చేతగాక నీళ్లు వదిలేసి, శ్రీశైలంలో ధర్నాలు చేయడం విడ్డూరం
- పాలమూరు-రంగారెడ్డి పనులను ప్రభుత్వం అటకెక్కించింది
- అన్యాయం జరుగుతుంటే కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎందుకు అడగరు
- విద్యుత్ శాఖలో ఆంధ్రా అధికారులకు రేవంత్ పెద్దపీట



*కృష్ణా జలాల పంపకాల్లో పొరుగు రాష్ట్రం నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ నీటిని తరలించుకుపోతుంటే తెలంగాణ సర్కారు చేష్టలుడిగి చూస్తోందని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత రెండేళ్ల కాలంలో ఆంధ్రప్రదేశ్ అత్యధికంగా నీటిని తరలించగా రాష్ట్రం మాత్రం తన వాటాను సైతం వాడుకోలేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.*

**హైదరాబాద్:** అపెక్స్ కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఎందుకు డిమాండ్ చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. పాలనను గాలికొదిలేసి ఢిల్లీ పర్యటనలు, శుభకార్యాల్లో బిజీగా ఉన్న ముఖ్యమంత్రికి ప్రాజెక్టుల రక్షణ పట్టడం లేదని విమర్శించారు. చేతనైతే ఢిల్లీలోనో లేక అమరావతిలోనో ధర్నా చేయాలి తప్ప శ్రీశైలం వద్ద నాటకాలు ఆడటం సరికాదని హితవు పలికారు. సాగునీటి రంగంలో తెలంగాణ ప్రయోజనాలను కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచీ బలిపీఠం ఎక్కిస్తూనే ఉందని ఆయన ఆరోపించారు. పాలమూరు బిడ్డగా చెప్పుకునే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ ప్రాజెక్టు కోసం కనీసం తట్టెడు

మిగతా 2లో




# వర్సిటీల పట్ల కాంగ్రెస్ నిర్లక్ష్యం

- 14 మంది విద్యార్థినులను ఎలుకలు కరిచి గాయపరిచాయి
- హాస్టల్ గదులు ఎలుకలు, పాములకు నిలయమయ్యాయి
- ప్రభుత్వం నిధులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తోంది
- ఎలుకల కాటు వల్ల ప్రమాదకర వ్యాధుల భయం
- వర్సిటీల నిర్వహణను కాంగ్రెస్ సర్కార్ గాలికొదిలేసింది
- విద్యార్థినుల భద్రతను పట్టించుకోని అధికారులపై ఆగ్రహం

2

# ప్రజల మద్దతుతోనే మూసీ పునరుజ్జీవనం

- మూసీ ప్రక్షాళనపై ఆన్‌లైన్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ
- ఇంటర్నెట్ లేని పేదల గోడును మెయిల్ ద్వారా ఎలా వింటారు?
- ప్రాజెక్టు డిజైన్లను బహిర్గతం చేయకుండా దాచడంపై అనుమానాలు
- బాధితులకు పునరావాసం చూపకుండానే అప్పుల కోసం ఆరాటం
- పేదల ఇళ్లు కూల్చేస్తూ, పెద్దల వాణిజ్య కట్టడాలను వదిలేశారు
- సామాన్యుల భద్రత కంటే కాంట్రాక్టర్ల లాభాలకే ప్రాధాన్యత



*మురికి కూపంగా మారిన మూసీ నదిని ప్రక్షాళన చేస్తామంటూ కాంగ్రెస్ సర్కార్ చేస్తున్న హడావుడి వెనుక అసలు ఉద్దేశాలపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. ప్రాజెక్టు పేరుతో వేల కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని కుమ్మరించేందుకు సిద్ధమైన పాలకులు, ఇప్పుడు ప్రజల భాగస్వామ్యం పేరుతో కొత్త నాటకానికి తెరతీశారు.*

**హైదరాబాద్:** నగర నడిబొడ్డున ఉన్న వేలాది పేదల ఇళ్లను కూల్చివేసి, వారిని రోడ్డున పడేసిన తర్వాత ఇప్పుడు అభిప్రాయ సేకరణ అంటూ కంటితుడుపు చర్యలకు దిగడం గమనార్హం. సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ నిర్వహించిన సమీక్షా సమావేశం కేవలం ఆర్భాటాలకే పరిమితమైందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పునరుజ్జీవం అనే నినాదంతో ముందుకు

మిగతా 2లో

# చిప్‌ల రంగంలో భారత్ విశ్వరూపం



- గుజరాత్‌లో రూ.3,300 కోట్లతో 'కైనెస్' సెమీకండక్టర్ యూనిట్
- ప్రపంచ చిప్‌ల సరఫరాలో భారత్ కీలక శక్తిగా మారుతుందని మోదీ ధీమా
- ఈ ప్లాంట్ ద్వారా రోజుకు 63.3 లక్షల చిప్‌ల తయారీ
- స్వయం సమృద్ధి లక్ష్యంగా సెమీకండక్టర్ మిషన్ 2 ప్రారంభం
- వలం 900 రోజుల్లోనే ప్రాజెక్టులు పూర్తి చేసి భారత్ సత్తా చాటింది
- జైన వారసత్వాన్ని చాటే 'సమ్రాట్ సంప్రతి' మ్యూజియం ఆవిష్కరణ

*భారతదేశాన్ని గ్లోబల్ సెమీకండక్టర్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. గుజరాత్‌లోని సనంద్‌లో కైనెస్ సెమీకండక్టర్ ప్లాంట్‌ను మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. దేశంలోని ప్రతి ఉత్పత్తి రంగంలో స్వయం సమృద్ధి సాధించడమే తమ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు.*

**న్యూఢిల్లీ:** గత బడ్జెట్‌లో ప్రకటించిన సెమీకండక్టర్ మిషన్ 2 ద్వారా చిప్‌ల తయారీలో భారత్ ప్రపంచ స్థాయికి చేరుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఒక భారతీయ కంపెనీ అంతర్జాతీయ సరఫరా గొలుసులో భాగస్వామి కావడం గర్వకారణమని ప్రధాని కొనియాడారు. ప్రపంచ మార్కెట్‌లో విశ్వసనీయమైన సరఫరాదారుగా భారత్ తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటుందని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. కరోనా మహమ్మారి సమయంలో ప్రపంచవ్యాప్తంగా సరఫరా వ్యవస్థలు దెబ్బతిన్నప్పుడు.. చిప్‌ల తయారీకి భారత్‌ను ఒక కేంద్రంగా

మిగతా 2లో

# అప్పుల కుప్పలో తెలంగాణ

- రిజిస్ట్రేషన్ల ఆదాయం రూ.14,296 కోట్ల నుండి రూ.8,473 కోట్లకు డ్రాప్
- బడ్జెట్ అంచనాల్లో కేవలం 76శాతం మాత్రమే ఖర్చు
- రికార్డు స్థాయిలో రూ.9,420 కోట్ల రెవెన్యూ లోటు
- రాష్ట్ర మొత్తం అప్పు రూ.5.62 లక్షల కోట్లకు చేరింది
- గత ఏడాదితో పోలిస్తే రాష్ట్ర రాబడి రూ.2,565 కోట్లు తగ్గింది
- వచ్చిన ఆదాయంలో 49శాతం జీతాలు, పెన్షన్లు, వడ్డీలకే
- ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ నిధుల్లో 37శాతం కోత విధించారు
- తెచ్చిన అప్పులను ఆస్తుల కల్పనకు వాడటంలో విఫలమయ్యారు
- రూ.3,213 కోట్ల ఉద్యోగుల సీపీఎస్ నిధులను ప్రభుత్వం వాడుకుంది
- వాస్తవ వృద్ధి రేటు 9శాతం మాత్రమేనని కాగ్ తేల్చింది

2



*తెలంగాణ ఆర్థిక ముఖచిత్రంపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ పేల్చిన అక్షర బాంబులు రాష్ట్ర పాలనా యంత్రాంగంలోని డొల్లతనాన్ని బట్టబయలు చేశాయి. అప్పులు తేవడంలో ఉన్న ఉత్సాహం, వాటిని ఆస్తులుగా మలచడంలో కనిపించకపోవడం గమనార్హం.*

# అమెరికా గడ్డపై కేటీఆర్ గళం

మొదటి పేజీ తరువాయి

ఈ భారీ కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తోంది. గత 21 ఏళ్లుగా నిరంతరాయంగా నిర్వహిస్తున్న ఈ సదస్సు దక్షిణాసియా వ్యాపార ధోరణులను ప్రపంచానికి పరిచయం చేయడంలో కీలక పాత్ర పోషిస్తోంది. ఈ ఏడాది నిర్వహిస్తున్న వేదికపై వ్యాపార రంగంలో లబ్ధప్రతిష్టులైన పలువురు అంతర్జాతీయ ప్రముఖులు కూడా పాల్గొంటున్నారు. కేటీఆర్ గతంలోనూ పలు అంతర్జాతీయ వేదికలపై తెలంగాణ సాధించిన ప్రగతిని సమర్థంగా చాటిచెప్పారు. ముఖ్యంగా 2025 ఏప్రిల్‌లో అమెరికాలోని నార్త్ వెస్టర్న్ యూనివర్సిటీ వేదికగా జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. అక్కడ తెలంగాణలో చోటుచేసుకున్న స్టార్టప్ విప్లవానికి మూలస్తంభాలుగా నిలిచిన టీ-హబ్, టీ-వర్క్స్, వీ-హబ్ వంటి సంస్థల పనితీరును ప్రపంచానికి వివరించారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత సాంకేతిక రంగంలో వచ్చిన మార్పులు, యువతకు లభించిన ప్రోత్సాహకాలపై ఆయన చేసిన ప్రసంగం ఆ దేశ విద్యావేత్తలను ఆకట్టుకుంది. ఆవిష్కరణల దిశగా అడుగులు వేస్తున్న నూతన రాష్ట్ర విధానాలను గ్లోబల్ కేస్ స్టడీగా ఆయన ప్రస్తావించారు. అదే ఏడాది జూన్ మాసంలో లండన్‌లోని ప్రఖ్యాత ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో 'గవర్నింగ్ ఇన్నోవేషన్ – – ఏ తెలంగాణ కేస్ స్టడీ' అనే అంశంపై కేటీఆర్ ఉపన్యసించారు. 2014 నుంచి తెలంగాణ సాధించిన సమగ్ర అభివృద్ధి, సుస్థిర వృద్ధి రేటును గణాంకాలతో సహా అక్కడ ప్రదర్శించారు. పరిపాలనలో సాంకేతికతను జోడించి ప్రజలకు సేవలను ఎలా చేరువ చేయవచ్చో ఆయన వివరించిన తీరు ప్రశంసలు అందుకుంది. ప్రపంచ స్థాయి విశ్వవిద్యాలయాలు తెలంగాణ మోడల్‌ను ఒక పరిశోధనాంశంగా గుర్తించేలా చేయడంలో ఆయన విదేశీ పర్యటనలు ఎంతగానో తోడ్పడ్డాయి. విదేశీ పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా రాష్ట్ర ప్రతిష్ఠను ఇనుమడింపజేయడంలో ఆయన విజయం సాధించారు. గత ఏడాది ఏప్రిల్‌లో లండన్‌లోని మేధో వేదిక 'బ్రిడ్జ్ ఇండియా' నిర్వహించిన కార్యక్రమంలోనూ కేటీఆర్ భాగస్వాములయ్యారు. అక్కడ 'ప్రాజెక్టింగ్ తెలంగాణ యాజ్ ఏ గ్లోబల్ కేస్ స్టడీ ఇన్ సస్టైనబుల్ గ్రోత్ అండ్ ఇన్నోవేషన్' అనే అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. పర్యావరణ హితమైన అభివృద్ధిని కాంక్షిస్తూనే పారిశ్రామిక రంగంలో దూసుకుపోవడం ఎలా సాధ్యమో ఆయన సోదాహరణంగా వివరించారు. తెలంగాణ సాధించిన జల విప్లవం, హరితహారం వంటి కార్యక్రమాలను అంతర్జాతీయ ప్రతినిధులకు పరిచయం చేశారు. వినూత్న ఆలోచనలకు వేదికగా నిలుస్తున్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు గల అవకాశాలను విదేశీ పారిశ్రామికవేత్తలకు వివరించారు. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో ప్రతిష్ఠాత్మక హార్వర్డ్ యూనివర్సిటీలో సైతం ఆయన గళం వినిపించారు. 'ది ఇండియా వి ఇమేజిన్' అనే అంశంపై ప్రసంగిస్తూ భవిష్యత్తు భారతం ఎలా ఉండాలో తన విజన్‌ను పంచుకున్నారు. దేశాభివృద్ధిలో రాష్ట్రాల పాత్ర, సమాఖ్య స్ఫూర్తి ప్రాధాన్యతను ఆయన గుర్తుచేశారు. యువత ఆకాంక్షలకు అనుగుణంగా విధాన నిర్ణయాలు ఉండాలని సూచించారు. అభివృద్ధి చెందిన దేశాల సరసన భారత్ నిలవాలంటే అనుసరించాల్సిన వ్యూహాలపై ఆయన చేసిన విశ్లేషణ మేధావులను ఆలోచింపజేసింది. ఇలా వరుసగా ప్రపంచ స్థాయి వేదికల నుంచి ఆయనకు ఆహ్వానాలు అందడం తెలంగాణ నాయకత్వ పటిమకు నిదర్శనంగా నిలుస్తోంది. కొలంబియా యూనివర్సిటీ సదస్సులో కేటీఆర్ ప్రసంగంపై ఇప్పుడు సర్వత్రా ఆసక్తి నెలకొంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో పెనుమార్పులు సంభవిస్తున్న ఈ తరుణంలో భారత్ పాత్రను ఆయన ఎలా చిత్రీకరిస్తారో చూడాలి. అంతర్జాతీయ సరఫరా గొలుసులో భారతీయ సంస్థల భాగస్వామ్యంపై ఆయన లోతైన విశ్లేషణ చేసే అవకాశం ఉంది. విదేశాల్లో ఉంటున్న భారతీయ మూలాలున్న విద్యార్థులు, వ్యాపారవేత్తలు పెద్ద ఎత్తున ఈ సదస్సుకు హాజరయ్యేలా కనిపిస్తున్నారు. ప్రపంచ స్థాయి నగరాల అభివృద్ధిలో హైదరాబాద్ మోడల్‌ను ఆయన మరోసారి ప్రస్తావించే వీలుంది. పెట్టుబడుల గమ్యస్థానంగా భారత్ ఎందుకు ఉత్తమమైనదో తన ప్రసంగం ద్వారా వివరించనున్నారు. రాజకీయ అంశాలకంటే ఎక్కువగా ఆర్థిక, పారిశ్రామిక, సాంకేతిక అంశాలపై కేటీఆర్ దృష్టి సారించడం విశేషం. ప్రపంచ స్థాయి విశ్వవిద్యాలయాలు ప్రజాప్రతినిధులను ఆహ్వానించేటప్పుడు వారి పనితీరును, అవగాహనను నిశితంగా పరిశీలిస్తాయి. ఈ క్రమంలో వరుసగా ఆక్స్‌ఫర్డ్, హార్వర్డ్ వంటి సంస్థల నుంచి పిలుపు అందుకోవడం ఆయన వ్యక్తిగత ఇమేజ్‌ను పెంచడమే కాకుండా రాష్ట్ర స్థాయిని పెంచుతోంది. విదేశీ పర్యటనల ద్వారా గ్లోబల్ లీడర్లతో పరిచయాలు పెంచుకోవడమే కాకుండా స్థానిక సమస్యలకు ప్రపంచ స్థాయి పరిష్కారాలను అన్వేషించేందుకు ఈ వేదికలు ఉపయోగపడతాయి. కేటీఆర్ ప్రసంగాల్లో కనిపించే స్పష్టత, ధారాళమైన ఇంగ్లీష్ పరిజ్ఞానం అంతర్జాతీయ వేదికలపై ఆయనకు ప్రత్యేక గుర్తింపు తెచ్చాయి. ఈ నెల 4న న్యూయార్క్‌లో జరగబోయే ఈ కార్యక్రమం తెలంగాణ రాజకీయాల్లోనూ చర్చనీయాంశంగా మారింది. అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న రాష్ట్రానికి ఇదొక గౌరవంగా పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. అగ్రరాజ్యంలో భారతీయ మేధస్సును చాటిచెప్పేందుకు ఇదొక సరైన వేదిక అని విశ్లేషకులు చెబుతున్నారు. సదస్సు నిర్వహణ కమిటీ అయిన సాబా సభ్యులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వివిధ దేశాల నుంచి వచ్చే ప్రతినిధులకు కేటీఆర్ తన ప్రసంగం ద్వారా సరికొత్త దిశానిర్దేశం చేయనున్నారు. ఇన్నోవేషన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇన్‌క్లూసివ్ గ్రోత్ అనే మూడు సూత్రాల ఆధారంగా భారత్ సాధిస్తున్న వృద్ధిని ఆయన కళ్ళకు కట్టినట్లు వివరించనున్నారు.

## మొదటి పేజీ తరువాయి

### ప్రజల మద్దతుతోనే మూసీ పునరుజ్జీవనం

సాగుతున్న ప్రభుత్వం, క్షేత్రస్థాయిలో బాధితుల ఆవేదనను మాత్రం పట్టించుకోవడం లేదు. మార్చి 31 నుంచి ఏప్రిల్ 15 వరకు ఆన్‌లైన్ ద్వారా సూచనలు స్వీకరిస్తామని ప్రకటించడం వెనుక భారీ కుట్ర దాగి ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇంటర్నెట్ సౌకర్యం లేని సామాన్య ప్రజలు, మురికివాడల్లో నివసించే నిరుపేదలు తమ గోడును మెయిల్ ద్వారా ఎలా వెల్లడిస్తారో పాలకులకే ఎరుక. డిజిటల్ మాధ్యమాల ద్వారా కేవలం మేధావుల, కార్పొరేట్ శక్తుల అభిప్రాయాలనే పరిగణనలోకి తీసుకుని, పేదల గొంతును నొక్కేసే ప్రయత్నం స్పష్టంగా కనిపిస్తోంది. మూసీ ప్రక్షాళన కోసం రూపొందించిన డిజైన్లు తుది దశకు చేరుకున్నాయని చెబుతున్న ప్రభుత్వం, అసలు ఆ నమూనాలను ఎందుకు బహిర్గతం చేయడం లేదన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. పునరావాస కార్యక్రమాలపై స్పష్టత లేకుండానే నిర్మాణాల గురించి చర్చించడం విడ్డూరంగా ఉంది. ఇప్పటికే ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులు పునరావాస కేంద్రాల్లో సరైన వసతులు లేక అల్లాడుతుంటే, అధికారులు మాత్రం బ్యాంకర్లతో చర్చలు జరుపుతూ ప్రాజెక్టు అంచనాలను పెంచే పనిలో నిమగ్నమయ్యారు. రుణాల పేరుతో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేస్తున్న ఈ చర్యలు భవిష్యత్తు తరాలకు భారంగా మారే ప్రమాదం ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశయాల మేరకు ఈ ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నామని చెబుతున్న మంత్రులు, ప్రజాస్వామ్యబద్ధంగా చర్చలు జరపడంలో విఫలమయ్యారు. రక్షణ శాఖకు సంబంధించిన భూముల విషయంలో ఉన్న చిక్కుముడులను విప్పకుండానే ముందుకు సాగడం అధికారుల అత్యుత్సాహాన్ని తెలియజేస్తోంది. ఒకవైపు నిధుల కొరతతో సంక్షేమ పథకాలు కుంటుపడుతుంటే, మరోవైపు మూసీ సుందరీకరణ కోసం వేల కోట్లు కేటాయించడం ప్రభుత్వ ప్రాధాన్యతలను ప్రశ్నిస్తోంది. ప్రజల అవసరాల కంటే కాంట్రాక్టర్ల ప్రయోజనాలే ముఖ్యమనే ధోరణి ఈ సమీక్షా సమావేశంలో ప్రతిబింబించింది. నిర్వాసితులతో నేరుగా చర్చించకుండా కేవలం మెయిల్ ఐడీని ప్రకటించి చేతులు దులుపుకోవడం బాధ్యతారాహిత్యం. క్షేత్రస్థాయిలో బాధితులు ధర్నాలు చేస్తున్నా, వారి వద్దకు వెళ్లి భరోసా ఇచ్చే తీరిక సబ్ కమిటీ సభ్యులకు లేకపోవడం శోచనీయం. అధికారులు తమ వృత్తి జీవితాల్లో ఈ ప్రాజెక్టును మైలురాయిగా మార్చుకోవాలని భట్టి విక్రమార్క సూచించడం విడ్డూరం. పేదల కన్నీళ్లపై కట్టే కట్టడాలు ఎప్పటికీ విజయవంతం కావు. అధికారులను ఒత్తిడికి గురి చేస్తూ నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించడం వల్ల నాణ్యత లోపించే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### చిప్‌ల రంగంలో భారత్ విశ్వరూపం

మార్చాలని తమ ప్రభుత్వం గట్టి సంకల్పం తీసుకుందని గుర్తుచేశారు. ఈ క్రమంలోనే 2021లో సెమీకండక్టర్ మిషన్‌కు శ్రీకారం చుట్టామని వివరించారు. ఇది కేవలం ఒక పారిశ్రామిక విధానం మాత్రమే కాదని, దేశ ఆత్మవిశ్వాసానికి నిదర్శనమని అభివర్ణించారు. 21వ శతాబ్దపు సాంకేతిక మార్పులకు భారత్ నాయకత్వం వహించే దిశగా సాగుతోందని పేర్కొన్నారు. గుజరాత్‌లోని సనంద్ పారిశ్రామిక వాడలో ఏర్పాటు చేసిన ఈ కైనెస్ ప్లాంట్ దేశంలోనే రెండో అతిపెద్ద సెమీకండక్టర్ యూనిట్‌గా రికార్డు సృష్టించింది. గతంలో ప్రారంభమైన మైక్రాన్ ప్లాంట్ తర్వాత ఈ స్థాయి పెట్టుబడితో వచ్చిన ప్రాజెక్టు ఇదే కావడం విశేషం. సుమారు 3,300 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ఈ ప్లాంట్ చిప్‌ల దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గిస్తుంది. ఇక్కడ ప్రధానంగా అడ్వాన్స్‌డ్ ఇంటెలిజెంట్ పవర్ మాడ్యూల్స్ ఉత్పత్తి చేయనున్నారు. ఇవి ఎలక్ట్రిక్ వాహనాలు, గృహోపకరణాలు, పారిశ్రామిక యంత్రాల్లో విద్యుత్ నియంత్రణకు అత్యంత కీలకంగా మారనున్నాయి. ఆటోమోటివ్ రంగానికి అవసరమైన కాంపాక్ట్, రిలయబుల్ పవర్ స్విచింగ్ సెమీకండక్టర్లను ఈ ప్లాంట్‌లో తయారు చేయనున్నారు. పూర్తిస్థాయి ఉత్పత్తి ప్రారంభమైన తర్వాత రోజుకు సుమారు 63.3 లక్షల యూనిట్ల చిప్‌లు ఇక్కడి నుంచి విడుదలవుతాయి. దేశీయ చిప్ ఎకోసిస్టమ్‌లో ఉన్న లోటును భర్తీ చేస్తూ అంతర్జాతీయ మార్కెట్‌లో భారత్‌ను ఒక శక్తిగా ఎదగడానికి ఈ యూనిట్ తోడ్పడనుంది. అత్యాధునిక సాంకేతికతతో కూడిన ఈ ప్లాంట్ ద్వారా వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని అధికారులు భావిస్తున్నారు.

### వర్సిటీల పట్ల కాంగ్రెస్ నిర్లక్ష్యం

**హైదరాబాద్:** వరంగల్ నగరానికి తలమానికంగా నిలవాల్సిన కాకతీయ విశ్వవిద్యాలయం నేడు పాలనా వైఫల్యానికి, పాలకుల నిర్లక్ష్యానికి సజీవ సాక్ష్యంగా మారింది. తెలంగాణ విద్యార్థి ఉద్యమాలకు గుండెకాయ వంటి ఈ క్యాంపస్‌లో ప్రస్తుతం భయం నీడలు కమ్ముకున్నాయి. ముఖ్యంగా సమ్మక్క-సారలమ్మ విద్యార్థినుల హాస్టల్‌లో చోటుచేసుకున్న తాజా ఘటన విద్యాశాఖ పనితీరును, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ ఉదాసీనతను ఎండగడుతోంది. అర్ధరాత్రి గాఢ నిద్రలో ఉన్న విద్యార్థినులపై ఎలుకలు దాడి చేసి, వారి మాంసాన్ని పీక్కుతిన్న వైనం వింటేనే ఒళ్ళు గగుర్పాటిస్తోంది. సుమారు 14 మంది విద్యార్థినులు ఈ దాడిలో గాయపడి ఆసుపత్రి పాలవ్వడం రాష్ట్రంలో ఉన్నత విద్యా సంస్థల దుస్థితికి అద్దం పడుతోంది. నాడు ఉద్యమాలతో గడగడలాడించిన గడ్డపై, నేడు ఆడబిడ్డలు కంటిమీద కునుకు లేకుండా ఎలుకలతో యుద్ధం చేయాల్సి రావడం పాలకుల అసమర్థతకు పరాకాష్టగా నిలుస్తోంది. రాష్ట్రంలో అధికారం మారితే విద్యా వ్యవస్థలో మార్పు వస్తుందని ఆశించిన విద్యార్థి లోకానికి నిరాశే మిగిలింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యూనివర్సిటీల అభివృద్ధిని పూర్తిగా గాలికొదిలేసిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హాస్టల్ గదుల్లో కనీస సౌకర్యాలు కల్పించడంలో వైఫల్యం చెందడమే కాకుండా, విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతోంది. గాయపడిన విద్యార్థినుల ఆర్తనాదాలు క్యాంపస్ గోడల మధ్య ప్రతిధ్వనిస్తున్నా, సచివాలయంలో ఉన్న పాలకులకు అవి వినిపించడం లేదని విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా హాస్టళ్లలో పారిశుద్ధ్యం ఇంత దారుణంగా దిగజారడం వెనుక నిధుల కొరత ఉందా లేక ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం ఉందా అన్నది తేలాల్సి ఉంది. పాలకులు కేవలం ప్రసంగాలకు పరిమితమై, క్షేత్రస్థాయిలో విద్యార్థుల గోసను పట్టించుకోవడం లేదన్నది వాస్తవం. విశ్వవిద్యాలయ ప్రాంగణమంతా నేడు అపరిశుభ్రతకు నిలయంగా మారింది. హాస్టళ్ల పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, అధ్వాన్నంగా మారిన డ్రైనేజీ వ్యవస్థ వర్సిటీ ప్రతిష్టను మంటగలుపుతున్నాయి. మురుగునీరు నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతున్నా, దోమలు స్వైరవిహారం చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. అధికారుల పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాతనైనా హాస్టళ్ల రూపురేఖలు మారుతాయని భావించిన విద్యార్థులకు, కుళ్ళిన వాసనలు, క్రిమికీటకాలే స్వాగతం పలుకుతున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభమై నెలలు గడుస్తున్నా, కనీస మెయింటెనెన్స్ పనులు చేయకపోవడం వెనుక ప్రభుత్వ అలసత్వం స్పష్టంగా కనిపిస్తోంది.

## ఏపీ సర్కార్ వెనక్కి తగ్గాల్సిందే!

**హైదరాబాద్:** తెలంగాణకు దక్కాల్సిన నీటి కేటాయింపుల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడే ప్రసక్తే లేదని ఆయన తేల్చి చెప్పారు. మంగళవారం విలేకరులతో మాట్లాడిన సందర్భంగా ఏపీ సర్కార్ తీరుపై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా రైతాంగ ప్రయోజనాలను కాపాడటమే తమ ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని ఆయన పునరుద్ఘాటించారు. శ్రీశైలం రిజర్వాయర్‌లో నీటి మట్టం కనిష్ట స్థాయికి చేరుకున్నప్పుడు పాటించాల్సిన నిబంధనలను ఏపీ ప్రభుత్వం తుంగలో తొక్కిందని జూపల్లి ఆరోపించారు. జలాశయంలో నీటి మట్టం 834 అడుగుల కంటే తక్కువగా ఉన్నప్పుడు విద్యుత్ ఉత్పత్తి చేయకూడదనే నిబంధన స్పష్టంగా ఉన్నప్పటికీ, పొరుగు రాష్ట్రం దానిని బేఖాతరు చేసిందని మండిపడ్డారు. తెలంగాణ సాగు, తాగునీటి అవసరాలను ఏమాత్రం పట్టించుకోకుండా అక్రమ పద్ధతుల్లో నీటిని తోడేయడం అన్యాయమని ఆయన పేర్కొన్నారు. దీనివల్ల కృష్ణా పరీవాహక ప్రాంతంలోని తెలంగాణ జిల్లాలకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు నిబంధనలకు లోబడి పనిచేయాలని ఆయన హితవు పలికారు. విద్యుత్ ఉత్పత్తిని ఆపాలని తాము ఎన్నిసార్లు విన్నవించినా ఏపీ ప్రభుత్వం తొలుత స్పందించలేదని మంత్రి గుర్తు చేశారు. అందుకే ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రజాప్రతినిధులమంతా కలిసి శ్రీశైలం వద్ద వంటావార్పు కార్యక్రమానికి పిలుపునిచ్చామని తెలిపారు. తెలంగాణ రైతాంగం ప్రయోజనాల కోసం తాము తీసుకున్న ఈ నిర్ణయం ఏపీ సర్కార్‌లో చలనం కలిగించిందని చెప్పారు. తమ నిరసన సెగ తగలడంతోనే చివరకు ఏపీ ప్రభుత్వం విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేయాల్సి వచ్చిందని ఆయన వివరించారు. ప్రజా సమస్యలపై పోరాడే విషయంలో తాము ఎప్పుడూ వెనకడుగు వేయబోమని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. తెలంగాణలో కొలువుదీరిన ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతు పక్షపాతిగా ఉంటుందని జూపల్లి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ, తమ ప్రాంత ప్రజాప్రతినిధులకు రాష్ట్ర ప్రయోజనాలే అత్యంత ముఖ్యమని చెప్పారు. పాలమూరు జిల్లాకు ఏ కొంచెం నష్టం జరిగినా ప్రభుత్వం సహించబోదని, రైతుల కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధమని ప్రకటించారు. పొరుగు రాష్ట్రం తన మొండి వైఖరిని వీడాలని, లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ఏపీ ప్రభుత్వంపై ఉందని ఆయన గుర్తు చేశారు. సమాఖ్య వ్యవస్థలో రాష్ట్రాలు పరస్పర సహకారంతో మెలగాలని, కానీ ఏపీ తీరు అందుకు విరుద్ధంగా ఉందని మంత్రి విమర్శించారు.

## ఆంధ్రాకు నీళ్లొదిలి కాంగ్రెస్ డ్రామాలు

మొదటి పేజీ తరువాయి

మట్టి కూడా తీయలేదని ఎద్దేవా చేశారు. ఉమ్మడి నల్లగొండ, పాలమూరు జిల్లాల్లో ప్రస్తుతం పంటలు చేతికి వచ్చే దశలో ఉన్నాయని ఇటువంటి కీలక సమయంలో నీరు అందక రైతుల కష్టార్జితం నేలపాలయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి దక్కాల్సిన నీటిని ఆంధ్రప్రదేశ్‌కు ధారాదత్తం చేస్తూ రేవంత్ రెడ్డి తన గురుదక్షిణ చెల్లించుకుంటున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎలాంటి ఇండెంట్లు లేకుండానే నీటి తరలింపు జరుగుతున్నా ప్రభుత్వం మౌనంగా ఉండటం దారుణమని ధ్వజమెత్తారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ వైఖరిని సైతం నిరంజన్‌రెడ్డి తప్పుబట్టారు. కృష్ణా బోర్డు పరిధిలో రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై కేంద్ర మంత్రులు ఒక్కనాడూ నోరు విప్పలేదని దుయ్యబట్టారు. ఏపీ ప్రభుత్వం బేసిన్ వెలుపల ఉన్న ప్రాంతాలకు హంద్రీనీవా, పెన్నా బేసిన్, గాలేరు నగరి వంటి పథకాల ద్వారా నీటిని తరలిస్తుంటే ఎందుకు అడ్డుకోవడం లేదని నిలదీశారు. ఇప్పుడు ఏకంగా బనకచర్ల వద్ద గోదావరి జలాలను కృష్ణాకు మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో రెండు జాతీయ పార్టీలు పూర్తిగా విఫలమయ్యాయని ఆయన విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీటి విషయంలో పూర్తిగా నిద్రపోతోందని ఆయన దుయ్యబట్టారు. ఈ ఏడాది కృష్ణా నదికి భారీగా వరదలు వచ్చినప్పటికీ 45 రోజులు ఆలస్యంగా పంపులను ప్రారంభించడం వల్ల తీవ్ర నష్టం జరిగిందని పేర్కొన్నారు. సాగునీటిని ఎత్తిపోసుకోవడంలో ప్రభుత్వం చూపిన జాప్యం వల్లే నేడు పంటలు ఎండిపోయే పరిస్థితి వచ్చిందని వివరించారు. రెండు వారాల ముందే పరిస్థితిపై హెచ్చరించినప్పటికీ అధికారులు, మంత్రులు మేలుకోలేదని మండిపడ్డారు. ఎస్సెల్బీసి ప్రమాదం జరిగితే కనీసం మృతదేహాలను బయటకు తీయలేని అసమర్థతలో ఈ ప్రభుత్వం ఉందని విమర్శించారు. వట్టెం పంప్ హౌస్ మునిగిపోతే పర్యవేక్షించాల్సిన మంత్రి మధ్యలోనే వెనుదిరగడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని చెప్పారు.

### కమలనాథుల గొంతులో హస్తం స్వరం

**హైదరాబాద్:** ఢిల్లీలో దోస్తీ, గల్లీలో కుస్తీ అన్నట్లుగా ఈ రెండు పార్టీల తీరు ఉందని, ఇద్దరి స్క్రిప్టు ఒక్కటేనని ఆయన ఎద్దేవా చేశారు. ప్రజా సంక్షేమం కంటే రాజకీయ కక్ష సాధింపులే ధ్యేయంగా ఈ పార్టీలు వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు అక్రమమని మాట్లాడుతున్న కేంద్ర మంత్రులు ఒక విషయాన్ని విస్మరిస్తున్నారని హరీశ్ రావు గుర్తు చేశారు. ఈ బృహత్తర ప్రాజెక్టుకు అవసరమైన అన్ని రకాల సాంకేతిక, పర్యావరణ అనుమతులు ఇచ్చింది సాక్షాత్తు కేంద్ర ప్రభుత్వమేనని ఆయన స్పష్టం చేశారు. నాడు ఇదే కేంద్ర ప్రభుత్వంలో కీలక మంత్రిగా ఉన్న నితిన్ గడ్కరీ కాళేశ్వరాన్ని తెలంగాణకు వరప్రదాయినిగా అభివర్ణించారని, అపర భగీరథ ప్రయత్నమని కొనియాడిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఇప్పుడు రాజకీయ ప్రయోజనాల కోసం మాట మార్చడం కేంద్ర మంత్రుల ద్వంద్వ నీతికి నిదర్శనమని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో వ్యవసాయ విప్లవానికి కాళేశ్వరం ఎలా నాంది పలికిందో కేంద్ర ఆర్థిక సర్వేలే గణాంకాలతో సహా వివరించాయని హరీశ్ రావు వివరించారు. ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చిన తర్వాత తెలంగాణలో పంటల ఉత్పత్తి రెట్టింపు అయ్యిందని కేంద్రమే గతంలో కితాబు ఇచ్చిందని ఆయన తెలిపారు. కాళేశ్వరం ఫలితాలు క్షేత్రస్థాయిలో కన్పిస్తుంటే, కేవలం బీఆర్ఎస్ పార్టీకి ఎక్కడ మంచి పేరు వస్తుందోనన్న భయంతోనే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు ఆపేసిందని ఆరోపించారు. కేంద్ర మంత్రి పాటిల్ వ్యాఖ్యలు చూస్తుంటే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాసిచ్చిన స్క్రిప్టును ఆయన చదువుతున్నట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. ప్రాజెక్టు వ్యయంపై కూడా తప్పుడు ప్రచారం చేస్తున్నారని హరీశ్ రావు అసహనం వ్యక్తం చేశారు. కాళేశ్వరం కోసం ప్రభుత్వం ఖర్చు చేసింది రూ.90 వేల కోట్లు అయితే, పనిగట్టుకుని లక్ష కోట్లు అని అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రాజెక్టు మొత్తం కొట్టుకుపోయిందని ప్రచారం చేస్తున్న వారు ఒక్కసారి మల్లన్న సాగర్ వైపు చూడాలని సవాల్ విసిరారు. ప్రాజెక్టు దెబ్బతింటే మల్లన్న సాగర్ రిజర్వాయర్‌లో ప్రస్తుతం ఉన్న 25 టీఎంసీల నీరు ఎక్కడి నుంచి వచ్చాయని ఆయన ప్రశ్నించారు. ఇది ప్రాజెక్టు పటిష్టతకు నిదర్శనం కాదా అని కాంగ్రెస్, బీజేపీ నేతలను నిలదీశారు. ప్రాజెక్టు ఫలితాల గురించి అనుమానాలు ఉన్నవారు తమతో కలిసి రావాలని హరీశ్ రావు బహిరంగ సవాల్ విసిరారు. కాళేశ్వరం జలాలతో కళకళలాడుతున్న పంట పొలాలను, రైతుల చిరునవ్వులను చూపిస్తామని ఛాలెంజ్ చేశారు. ఏసీ గదుల్లో కూర్చుని అబద్ధాలు వండటం కాదని, క్షేత్రస్థాయిలోకి వెళ్తే వాస్తవాలు బోధపడతాయని హితవు పలికారు. కేవలం రాజకీయ లబ్ధి కోసం తెలంగాణ రైతాంగం కష్టార్జితమైన ప్రాజెక్టును తక్కువ చేసి మాట్లాడటం సరికాదని హరీశ్ రావు హెచ్చరించారు.

## అప్పుల కుప్పలో తెలంగాణ

**హైదరాబాద్:** బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల నుంచి ఎడాపెడా తెచ్చిన రుణాలను రాష్ట్ర ప్రయోజనాల కోసం మళ్లించడంలో ప్రస్తుత ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని కాగ్ నివేదిక తేల్చి చెప్పింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి విడుదల చేసిన ఈ నివేదిక, రాష్ట్రం భారీ రెవెన్యూ లోటు దిశగా వేగంగా అడుగులు వేస్తోందని హెచ్చరించింది. బడ్జెట్ ప్రసంగాల్లో ఆర్భాటంగా ప్రకటించే అంకెలకు, క్షేత్రస్థాయిలో జరిగే ఖర్చులకు మధ్య పొంతన లేకపోవడం ఆర్థిక క్రమశిక్షణారాహిత్యానికి పరాకాష్టగా నిలుస్తోంది. గతేడాది అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టిన సమయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఎంతో ప్రణాళికాబద్ధమైన లెక్కలని చెప్పుకొచ్చారు. కానీ కాగ్ బయటపెట్టిన వాస్తవాలు అందుకు భిన్నంగా ఉన్నాయి. 2024-25 వార్షిక బడ్జెట్ అంచనాలు రూ.2,21,242 కోట్లుగా ఉంటే, వాస్తవ కేటాయింపులు రూ.1,67,804 కోట్లకు పరిమితమయ్యాయి. అంటే అంచనా వేసిన దానిలో కేవలం 76 శాతం మాత్రమే అమలుకు నోచుకుంది. ఇక రెవెన్యూ వ్యయం విషయంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. రూ.2,20,945 కోట్ల వ్యయం జరుగుతుందని భావిస్తే, అది రూ.1,77,224 కోట్లు అంటే 80 శాతానికే పరిమితమైంది. అంచనాలకు ఆచరణకు మధ్య ఉన్న ఈ భారీ వ్యత్యాసం ప్రభుత్వ అస్తవ్యస్త నిర్వహణకు నిదర్శనమని నివేదిక స్పష్టం చేసింది. రాష్ట్ర చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా రెవెన్యూ లోటు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తొలి ఏడాది 2014-15లో రూ.368 కోట్ల మిగులు ఉండగా, గత ప్రభుత్వ హయాంలో అది రూ.779 కోట్లకు పెరిగింది. కానీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అది ఏకంగా రూ.9,420 కోట్ల లోటుగా మారడం గమనార్హం. గతంలో కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లో తప్ప మరే సమయంలోనూ ఇంతటి లోటు రాలేదు. సంక్షేమ రాజ్యమని చెప్పుకుంటున్న వేళ, ఆదాయ వ్యయాల మధ్య ఇంతటి అసమతుల్యత ఏర్పడటం వెనుక అంతర్యం ఏమిటో పాలకులకే ఎరుక. ఏడు పద్దులు, రెండు అప్రాప్రియేషన్లలో కలిపి ఏకంగా రూ.31,229 కోట్లు అదనంగా ఖర్చు చేయడం బడ్జెట్ నియంత్రణ కోల్పోయిందనే విషయాన్ని రూఢీ చేస్తోంది. రాష్ట్ర ఆదాయ వనరుల వినియోగంపై కాగ్ లోతైన విశ్లేషణ చేసింది. చేతికి అందిన రూ.1.67 లక్షల కోట్లలో సుమారు 49 శాతం నిధులు కేవలం వేతనాలు, వడ్డీలు, పెన్షన్లకే సరిపోతున్నాయి. ఉద్యోగుల జీతాల కోసం రూ.35,521 కోట్లు, పాత అప్పుల వడ్డీల కోసం రూ.27,803 కోట్లు, పెన్షన్ల నిమిత్తం రూ.16,942 కోట్లు ఖర్చు చేయాల్సి వచ్చింది. దీనివల్ల అభివృద్ధి పనులకు నిధుల కొరత ఏర్పడుతోంది. ఎఫ్.ఆర్.బి.ఎం పరిమితులను సైతం బేఖాతరు చేస్తూ అప్పుల కుప్పను పెంచుకుంటూ పోతున్నారు. జి.ఎస్.డి.పిలో అప్పుల శాతం 32.80 లోపు ఉండాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, అది 34.29 శాతానికి ఎగబాకింది. ఫలితంగా రాష్ట్ర మొత్తం అప్పు రూ.5,62,662 కోట్లకు చేరి ఆర్థిక సంక్షోభం అంచున నిలబెట్టింది.

ఆదాయం పెంచుకోవడంలోనూ ప్రభుత్వం చేతులెత్తేసింది. గడిచిన ఏడాది కంటే ఈసారి రాష్ట్ర స్వయం ఆదాయం (ఎస్.ఓ.టి.ఆర్) రూ.2,565 కోట్ల మేర తగ్గడం గమనార్హం. కేంద్ర పన్నుల వాటా రూపంలో రాష్ట్రానికి రావాల్సిన నిధులు రూ.23,742 కోట్ల నుంచి రూ.27,050 కోట్లకు పెరిగినప్పటికీ, రాష్ట్రం సొంతంగా నిధులు సమకూర్చుకోలేకపోతోంది. రియల్ ఎస్టేట్, వ్యాపార రంగాలు కుదేలు కావడంతో రిజిస్ట్రేషన్లు, స్టాంపుల రాబడి రూ.14,296 కోట్ల నుంచి రూ.8,473 కోట్లకు పడిపోయింది. వాహన పన్నుల వసూళ్లలోనూ తగ్గుదల నమోదైంది. కేవలం 9 శాతం వృద్ధి రేటును సాధించి, బడ్జెట్ లో 10.6 శాతం అని అసత్య ప్రచారం చేసుకున్న తీరును కాగ్ ఎండగట్టింది. రాష్ట్రాన్ని ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారుస్తామన్న ప్రభుత్వ ప్రకటనలు కేవలం కాగితాలకే పరిమితం కానున్నాయని విశ్లేషణలు చెబుతున్నాయి. ఒక ట్రిలియన్ డాలర్ అంటే సుమారు రూ.93 లక్షల కోట్లు. ఈ స్థాయిని అందుకోవాలంటే రాబోయే ఎనిమిదేళ్లలో ప్రతి ఏడాది 20.7 శాతం చక్రవడ్డీ రేటుతో వృద్ధి సాధించాలి. కానీ ప్రస్తుతం నమోదవుతున్న 9 శాతం వృద్ధితో ఆ లక్ష్యం దిశగా పయనించడం అసాధ్యమని కాగ్ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఆచరణ సాధ్యం కాని హామీలతో ప్రజలను మభ్యపెడుతున్నారనే విమర్శలకు ఈ నివేదిక బలాన్నిస్తోంది. అప్పులు పెంచుకుంటూ పోవడం తప్ప, సంపద సృష్టిపై దృష్టి పెట్టకపోవడం రాష్ట్ర భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తోంది. అప్పులు తెచ్చిన నిధులను మూలధన వ్యయంగా మార్చడంలో ప్రభుత్వం విఫలమైంది. 2024-25లో తెచ్చిన రూ.56,968 కోట్ల రుణాలలో కేవలం రూ.36,072 కోట్లు మాత్రమే ఆస్తుల కల్పనకు వాడారు. మిగిలిన నిధులను దైనందిన అవసరాలకు మళ్లించడం వల్ల రాష్ట్రానికి శాశ్వత ప్రయోజనం చేకూరడం లేదు. కీలకమైన సాగునీటి ప్రాజెక్టులకు కోతలు విధించారు. పాలమూరు రంగారెడ్డి, కాళేశ్వరం ఎత్తిపోతల పథకాలకు కేటాయించిన రూ.4,054 కోట్లను ఖర్చు చేయకుండా మిగిల్చారు. అలాగే మిషన్ భగీరథ, స్వచ్ఛ భారత్ వంటి ప్రజాప్రయోజన పథకాలకు నిధులు నిలిపివేసి, ఆ నిధులను ఇతర అవసరాలకు వాడుకోవడం గమనార్హం. సంక్షేమ పథకాల విషయంలోనూ ప్రభుత్వ తీరు విమర్శల పాలవుతోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల అభివృద్ధి కోసం రూ.25,971 కోట్లు కేటాయించినట్లు బడ్జెట్ లో గొప్పగా చెప్పారు. కానీ వాస్తవానికి ఖర్చు చేసింది కేవలం రూ.9,721 కోట్లు మాత్రమే. అంటే ఈ వర్గాల నిధుల్లో 37 శాతం కోత విధించినట్లు స్పష్టమవుతోంది. ముఖ్యమంత్రి నుంచి మంత్రుల వరకు అందరూ ఇది గరీబీ హటావో ప్రభుత్వమని ప్రచారం చేసుకుంటున్నా, క్షేత్రస్థాయిలో నిధుల విడుదల లేక నిరుపేదలు ఇబ్బందులు పడుతున్నారు. మాటలు కోటలు దాటుతున్నా, చేతలు మాత్రం గడప దాటడం లేదని కాగ్ నివేదికతో తేటతెల్లమైంది. ఉద్యోగుల సంక్షేమం పట్ల కూడా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.

వేగుచుక్క

# కేఓఎస్ ప్రీ ప్రైమరీలో.. ఘనంగా "గ్రాడ్యుయేట్ డే".

- ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతి వేడుకలు.
- ముఖ్య అతిథిగా హాజరైన పోలీస్ ఆఫీసర్ సందీప్ కుమార్.
- పాల్గొన్న కాకతీయ విద్యాసంస్థల చైర్మన్ సిహెచ్ విజయలక్ష్మి, డైరెక్టర్ సిహెచ్ రజనీకాంత్














వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:

జిల్లా కేంద్రంలోని కాకతీయ ఒలంపియాడ్ స్కూల్ ప్రీ ప్రైమరీలో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పోలీస్ ఆఫీసర్ సందీప్ కుమార్ మాట్లాడుతూ, పిల్లల మానసిక పరిపక్వత కొరకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ఒక పేరెంటుగా ఎంతో సంతోషంగా ఉందని తెలియజేశారు.

**విద్యార్థుల తల్లిదండ్రులు స్కూలు స్థాయిలోనే మేల్కోవాలి: కేఓఎస్ డైరెక్టర్ సి హెచ్ తేజస్విని.**

ఈ ఆధునిక విద్యా విధానంలో ఆల్ రౌండ్ డెవలప్మెంట్ ఉంటేనే జాతీయ స్థాయి పోటీ పరీక్షలైన, ఐఐటీ మెడికల్ లో రాణించగలుగుతారని అన్నారు. అసలు ఆల్రౌండ్ డెవలప్మెంట్ అంటేనే విద్యార్థులకు స్కూలు స్థాయి నుండి రెగ్యులర్ విద్యతో పాటు నిజమైన ఐఐటీ మెడికల్ ఫౌండేషన్ ఇంటర్మీడియట్ /ఎంసెట్ ఎక్స్పర్ట్ చే ట్రైనింగ్ ఇప్పించడం, స్ట్రెస్ కొరకు మరియు ఫిజికల్ స్ట్రెంత్ కొరకు గేమ్స్ అండ్ స్పోర్ట్స్ నిష్ణాతులైన కోచ్ ద్వారా ఇప్పించడం, మెంటల్ స్ట్రెంత్ కొరకు రోబోటిక్స్ ఒలంపియాడ్ ఎగ్జామ్స్ కాంపిటీషన్స్ తద్వారా విద్యార్థి ఆల్ రౌండ్ డెవలప్మెంట్ అవుతాడు అని వివరించారు.

**రెగ్యులర్ విద్యతోపాటు ఐఐటి మెడికల్ ఫౌండేషన్: కేఓస్ డైరెక్టర్ సిహెచ్. రామోజీరావు.**

రెగ్యులర్ విద్యతోపాటు ఐఐటి మెడికల్ ఫౌండేషన్ ఇంటర్మీడియట్ ఎంసెట్ స్థాయి లెక్చరర్స్ తో చెప్పిస్తూ మానసికంగా దృఢంగా ఉండేందుకు ఇంటర్నల్ కాంపిటీషన్స్, ఇంటర్నల్ గేమ్స్ శారీరక దృఢత్వం కొరకు స్పోర్ట్స్ కోచెస్ ద్వారా ఇప్పించడం, టెక్నికల్ గా రాణించడం కొరకు రోబోటిక్స్, ఏఐ బేస్డ్ కాంపిటీషన్స్, ఐఐటి బేస్డ్ ఒలంపియాడ్ ఎగ్జామ్స్, ఇలా ఎన్నో విషయాలలో విద్యార్థులకు విద్యనందిస్తూ ముందుకు సాగుతుంది కేఓస్ అని అన్నారు. ఇలాంటి అన్ని కార్యక్రమాల వల్ల విద్యార్థి లీడర్షిప్ క్వాలిటీస్ డెవలప్ అయ్యి సమాజంలో గొప్ప వ్యక్తిగా మారడానికి అవకాశం ఉంటుందనీ పేర్కొన్నారు. కనుక తల్లిదండ్రులు నూతన విద్యా విధానంలో భాగంగా జాతీయ దృక్పథంతో ఆలోచించాలనీ, స్కూల్ స్థాయిలోనే మేలుకోవాలన్నారు. నిర్ణయం మీదైతే



భవిష్యత్తు మీ పిల్లలది అవుతుంది అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు ప్రదర్శించినఆటపాటలు అందర్నీ అలరించాయి అనేక సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాకతీయ విద్యాసంస్థల చైర్పర్సన్ సిహెచ్ విజయలక్ష్మి , కాకతీయ డైరెక్టర్ సిహెచ్ రజనీకాంత్, సిహెచ్ రాజా, ప్రిన్సిపల్స్ నటరాజ్ , కేఓఎస్ అకాడమీక్ కోఆర్డినేటర్స్ మరియు కోఆర్డినేటర్స్ అలాగే అధిక సంఖ్యలో తల్లిదండ్రులు పాల్గొన్నారు.









# భారత ఎన్నికల తీరు మారాల్సిందే !



ఎన్నికల సంస్కరణలు చేయకుండా, పార్లమెంట్, అసెంబ్లీ సీట్లు పెంచినంత మాత్రాన భారత్ భవిష్యత్ మారదు. రాజకీయ పార్టీలకు మేలు చేసే నిర్ణయాలు తప్ప ప్రజలకు ఒనగూరే ప్రయోజనం లేదు. ప్రధానంగా పదేపదే సభ్యులు కొందరే పార్లమెంటుకు, అసెంబ్లీలకు ఎన్నికవుతున్నారు. దీనిని అరికట్టాల్సి ఉంది. సీట్లు పెంపు తీరును తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి తప్పు పడుతున్నారు. దీంతో దక్షిణాదికి అన్యాయం జరుగుతుందని అంటున్నారు. దీనిపైనా చర్చించాలి. దేశంలో ప్రజలకు రాజకీయ అవకాశం రావాలి. ముఖ్యంగా దళిత, గిరిజన, మహిళలకు పెద్ద ఎత్తున అవకాశాలు రావాలి. వారిని ఈ దేశ అధికారంలో భాగస్వామ్యం చేయాలి. కానీ అలా జరగడం లేదు. కేవలం కొన్ని సీట్లు వారికి కేటాయిస్తు న్నాయి. రాకీయంగా దళితులు, గిరిజనులకు కనీసం 50శాతం సీట్లు రిజర్వ్ చేయాలి. అందులోనూ గతంలో వరుసగా ఎన్నికవుతూ వస్తున్న వారిని మళ్లీ పోటీకి దూరం చేయాలి. అలాగే రెండు ట్మ్రలకు మించి అవకాశం లేకుండా సంస్కరణలు చేయాలి. లేదా రాజ్యాంగ సవరణ చేయాలి. అప్పుడే ఇప్పుడు పాతుకు పోయిన వారు బయటకు పోతారు. పార్లమెంట్, అసెంబ్లీలో కొత్తతరం ప్రవేశిస్తుంది. కొత్తగా ఆలోచిస్తారు. ఇటీవల పార్లమెంటులో ఎన్నికల సంస్కరణలపై చర్చ తూతూ మంత్రంగా సాగింది. అసలు విషయాలను పక్కదారి పట్టించేలా చేశారు. ఇలాంటి విషయాలను ఏ ఒక్కరూ ప్రతిపాదించలేదు. అధికార బిజెపి లేదా ఎన్డిఎ కూడా పక్కాగా ఎన్నికల సంస్కరణల ప్రతిపాదనలు ప్రకటించడంలేదు. విపక్షనేత రాహుల్ కేవలం సర్‌ను వ్యతిరేకించడం మాత్రమే అలవాటు చేసుకున్నారు. రాజ్యాంగ పుస్తకాన్ని చేతిలో పట్టుకుని ఊరేగుతున్న రాహుల్‌కు రాజ్యాంగంలో ఏముందో తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదు. ఎందుకంటే ఎన్నికల ప్రక్రియ విఫలం అవుతోంది. డబ్బున్న వారే ఎన్నికవుతున్నారు. ఒక్కరే పదేపదే చట్టసభల్లో ఉంటున్నారు. వీలయితే జీవితాంతం చట్టసభ సభ్యులుగా ఉంటున్నారు. ఇక దొంగ ఓట్లను చేర్పించి, ఓట్లను చోరీ చేస్తున్నారు. పదేపదే ఎన్నికల నిర్వహణతో దేశ ఖజానాపై భారం మోపుతున్నారు. ఒకేదేశం, ఒకే ఎన్నిక అంటున్న బిజెపి కూడా దీనిపై సమగ్ర విధానం ప్రకటించడం లేదు. మన ఎన్నికల వ్యవస్థలో ఉన్న లోపాలను చర్చించి, రాజ్యాంగ సవరణకు పూనుకోవాలి. ప్రధానంగా దేశానికి భారంగా మారిన పదేపదే ఎన్నికల నిర్వహణ విధానం మారాలి. అన్ని రాష్ట్రాల్లో ఒకే తడవలో ఎన్నికలు జరిగేలా చూడాలి. రాజకీయ పార్టీలు నిరంతరం ఎన్నికలు ఉండాలని కోరుకుంటున్నాయి. అలాగే తామే నిరంతరం ప్రజాప్రతినిధులుగా చట్టసభల్లో తిష్టవేయాలని చూసుకుంటున్నారు. ఇదే వీరి ఎన్నికల సంస్కరణగా ఉంది. ఇలాంటి ఎన్నికల వల్ల కొందరే ప్రజాప్రతినిధులుగా కొనసాగుతున్నారు. అలాగే ఒక వ్యక్తి రెండుచోట్ల పోటీ చేసే పద్ధతిని కూడా రద్దు చేయాలి. గతంలో రాహుల్ రెండుచోట్ పోటీ చేశారు. మోడీ చేశారు. ఇప్పుడు తమిళనాట విజయ్ కూడా రెండుచోట్ల పోటీ చేస్తున్నారు. దీనివల్ల కూడా ఖజానాపై భారం పడుతుంది. ఇలాంటి విషయాల్లో అన్ని పార్టీలది ఒకటే దారిగా ఉంది. ఎందుకంటే ప్రజాస్వామ్యం ముసుగులో నేతలు నియంతలుగా మారుతున్నారు. ఈ క ÷-రమంలో ఇప్పుడు పార్లమెంట్, అసెంబ్లీ సీట్లు పెరగడం వల్ల మరికొందరు చట్టసభల్లోకి వస్తారు. దీంతో ఖజానాపై మరింత భారం పడుతుంది. అలాగే వారికి సౌకర్యాలు పెరుగుతాయి. అందువల్ల ప్రజాప్రతినిధులకు లక్షల్లో జీతాలు, జీతభత్యాలు, పెన్షన్లను కూడా రద్దు చేయాలి. ఒక్కో ప్రజాప్రతినిధి రెండేసి పెన్షన్లు కూడా పొందుతున్నారు. పార్లమెంటుకు పనిచేసి, అసెంబ్లీకి ఎన్నికైన వారు రెండుచోట్లా పెన్షన్లు పొందుతున్నారు. అందుకే చట్టసభలకు తప్ప, సభ్యులకు అధికారాలే తక్కువగా ఉంటే సమస్య రాదు. చట్టసభలకు ఎన్నికైన సభ్యులకు అలవిమాలిన సౌకర్యాలను కూడా

తగ్గించాలి. పెన్షన్లు తక్షణం ఎత్తేయాలి. 2026 జనాభా గణన ఆధారంగా పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్విభజన జరగాల్సి ఉంది. ఒకే దేశం, ఒకేఎన్నిక అంటే పార్లమెంటు, రాష్ట్ర శాసనసభలకు ఒకేసారి ఎన్నికల నిర్వహణ జరగాలి. ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ జరగాల్సిందే. అలాగే దొంగ ఓట్లు లేకుండా పక్కాగా ఓటరు కార్డు ఉండాలి. నిరంతరం ఓటరు జాబితాను సమీక్షించే విధానం రావాలి. ఎక్కడ నివాసం ఉంటే అక్కడే ఓటేసేలా చట్టబద్ధత ఉండాలి. నేతలు రెండు పర్యాయాలకు మించి పోటీ చేసే అవకాశం లేకుండా చూడాలి. ఒక దేశం, ఒక ఎన్నిక అనేది బీజేపీకి ప్రయోజనాలను సమకూరుస్తుందనే వాదనలో పసలేదు. పార్లమెంటు, రాష్ట్ర శాసనసభకు ఒకేసారి ఎన్నికలు జరపడం వల్ల అధికారంలో ఉన్న పార్టీకి పరిస్థితులు అనుకూలమవుతాయని వితండ వాదనతో దీనిని వ్యతిరేకిస్తున్నారు. అందుకే ఎన్నికల సంస్కరణ అనేది ఓటర్లకు సంబంధించినది మాత్రమే కాదు. యావత్తు భారత జాతికి సంబంధించినది. ఇది పార్లమెంటులో ప్రస్తుతం ఉన్న ఎంపిల వ్యవహారం అస్సలు కానేకాదు. తమను అత్యున్నత చట్టసభకు తీసుకువచ్చి, తద్వారా అధికారాన్ని అప్పగించిన ఓటర్లు తమ ఓటు దుర్వినియోగం కాకుండా చూసుకోవాల్సి ఉంది. పటిష్టమైన ప్రజాస్వామ్య వ్యవస్థ కోసం నియమ నిబంధనలను మార్చాల్సిన ఆవశ్యకత విషయమై పార్లమెంటేరియన్లంతా చర్చించాలి. అలాగే ఎన్నికలలో ధనబలం, కండబలం ప్రభావాన్ని తగ్గించేందుకు తీసుకురావాల్సిన చట్టాల గురించీ చర్చించాలి. ఎన్నికల సమగ్రత, నిష్పాక్షికత చాలా ముఖ్యం అన్న విషయం ఇక్కడ గుర్తించాలి. ఎన్నికల వ్యవస్థలో ఉన్న లోపాల కారణంగా రాజకీయ నేతలు అనుసరిస్తున్న వికృతాలను నిరోధించేందుకు పార్లమెంటు చర్చించడం కూడా ముఖ్యం. ప్రధానంగా ప్రజల భాగస్వామ్యం పెరగాలి. పేదలైన ప్రజలకు చట్టసభలో ప్రవేశించే అవకాశం రావాలి. అవసరమైతే ఇందుకు నిబంధనలు లేదా రిజర్వేషన్లు పెట్టాలి. చట్టసభల్లో నిరంతరం కొత్తవాళ్లు ఎన్నికలైతేనే అవినీతి, మోనోపలి తగ్గుతుంది.

## రోడ్డు ప్రమాదాల నివారణకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు.






### కలెక్టర్ ఇలా త్రిపాఠి.రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో దిశా నిర్దేశం.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, మార్చి 31**

: రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి దిశా నిర్దేశం చేశారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటిస్తే, ప్రమాదాలకు ఆస్కారం ఉండదని అన్నారు. ఈ దిశగా పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో పాటు అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉన్న మార్గాల ద్వారా చైతన్యపర్చేందుకు కృషి చేయాలన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం రోడ్డు భద్రతా కమిటీ సమావేశం జరుగగా, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య హాజరయ్యారు. నేషనల్ హైవే అథారిటీ, ఆర్ అండ్ బి, రవాణా శాఖ, ఆర్టీసీ, పంచాయతీ రాజ్, విద్యుత్, వైద్యారోగ్యం, మున్సిపల్ తదితర శాఖల అధికారులతో పాటు రోడ్ సేఫ్టీ కమిటీ సభ్యులు, రెడ్ క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు. తరుచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్న 55 బ్లాక్ స్పాట్ ప్రాంతాల గురించి, ప్రమాదాలకు గల కారణాలపై సమావేశంలో చర్చించి పలు సూచనలు చేశారు. ప్రమాదాలను నిలువరించేందుకు ఆయా శాఖల వారీగా చేపట్టాల్సిన చర్యల గురించి కలెక్టర్ సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం లైన్ డిపార్ట్ మెంట్స్ కు చెందిన అధికారులు పరస్పర సమన్వయంతో, సమిష్టిగా కృషి చేయాలన్నారు.

సాయంత్రం ఐదు గంటల తరువాత ఇసుక లోడ్ తో కూడిన వాహనాలు తిరగకుండా నిఘా ఉంచాలన్నారు. స్కూల్ బస్సుల తనిఖీ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, ప్రతి వాహనం తగిన ఫిట్ నెస్ కలిగి ఉండాలన్నారు. వరి కోతల సమయంలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నట్లు గణాంకాల ద్వారా తెలుస్తోందని, దీనిని దృష్టిలో పెట్టుకొని ఓవర్ లోడ్ తో వెళ్ళే వాహనాలను నియంత్రించేలా కార్యాచరణ అమలు చేయాలన్నారు.

అతి వేగం, తాగి వాహనాలు నడపడం, సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడపడం వల్ల కలిగే అనర్థాలను తెలియజేస్తూ విద్యార్థులకు, వాహన డ్రైవర్లకు, ప్రజలకు అవగాహన పెంపొందేలా విరివిగా ప్రచారం నిర్వహించాలని అన్నారు. బ్లాక్ స్పాట్లుగా గుర్తించబడిన ప్రదేశాలలో తక్షణ చర్యలు చేపట్టి ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. ఎక్కడ ప్రమాదం జరిగినా, అందుకు గల కారణాలపై పూర్తిస్థాయిలో పరిశీలన జరపాలని, తద్వారా అలాంటి చోట్ల మరోమారు ప్రమాదాలు జరుగకుండా నియంత్రణ చర్యలు చేపట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. అధికారులు అంకితభావంతో కృషి చేస్తూ నిజామాబాద్ ను ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, ఆర్డీఓ రాజేంద్ర కుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి, డీఈఓ అశోక్, డిప్యూటీ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ దుర్గా ప్రమీల, డీటీఓ ఉమా మహేశ్వరరావు, డీఈఓ అశోక్, జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి, హర్ష తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో జయలలిత ఇల్లు సీజ్

**ఇంటిపన్ను చెల్లించకపోవడంతో చర్యలు**



హైదరాబాద్: తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, దివంగత జయలలితకు చెందిన ఇల్లు సీజ్ చేశారు. ఇంటిపన్ను బకాయిలు చెల్లించకపోవడంతో ఈ చర్య తీసుకున్నారు. హైదరాబాద్‌లో ఉన్న ఆమె ఇంటిని జీహెచ్ఎంసీ అధికారులు సోమవారం సీజ్ చేశారు. శ్రీనగర్ కాలనీలో ఉన్న ఆమె ఇంటికి సంబంధించిన ఆస్తి పన్ను బకాయిలు చెల్లించకపోవడంతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. జీహెచ్ఎంసీ అధికారులు ఫిబ్రవరిలోనే ఆస్తిపన్ను బకాయిలపై నోటీసులు జారీ చేశారు. అయితే జయలలితకు సంబంధించివారి నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ఈ క్రమంలో శ్రీనగర్ కాలనీలో ఉన్న జీ?4 భవనాన్ని సీజ్ చేశారు. ఈ ఇంటికి సంబంధించి 2017 నుంచి సుమారు రూ.83 లక్షల ఆస్తి పన్ను బకాయిలు ఉన్నాయని సమాచారం. సోమవారం జీహెచ్ఎంసీ ఏఎంసీ బాల్‌రాజ్ ఆధ్వర్యంలో సిబ్బంది జయలలిత ఇంటిని సీజ్ చేశారు. మార్చి 31 వరకు ఓటీఎస్ స్కీమ్ అందుబాటులో ఉందని, ఆ రాయితీ పోగా మొత్తం రూ.82,91,822 మేర బకాయిలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. జయలలితకు సంబంధించిన ఈ భవనంలో గతంలో ప్రైవేట్ కార్యాలయాన్ని నిర్వహించారు. అయితే ఈ భవనాన్ని 2017 నుంచి నివాసానికి వాడుకుంటున్నామని.. కాబట్టి రెసిడెన్షియల్‌గా మార్చాలని జీహెచ్ఎంసీ అధికారుల్ని జయలలిత మేనల్లుడు, చెన్నైకి చెందిన దీపక్ జయకుమార్ గతంలో కోరారు.

## నిజామాబాద్ జిల్లాలో అకాల వర్షం

నిజామాబాద్: జిల్లాలో సోమవారం అర్ధరాత్రి నుంచి కురుస్తున్న అకాల వర్షాలకు పలుచోట్ల పంటలు దెబ్బతిన్నాయి. ప్రధానంగా వరి, మామిడి పంటలకు తీవ్ర నష్టం జరిగినట్లు తెలుస్తోంది. బాన్సువాడ, బోధన్ నియోజకవర్గాల్లో వరి కోతలు చురుగ్గా సాగుతున్నాయి. చేతికి వచ్చిన ధాన్యాన్ని ఆరబోయగా తడిసి ముద్దవ్వడంతో రైతులు లబోదిబోమంటున్నారు. కోటగిరి, పోతంగల్, బోధన్, ఎడపల్లి ధర్పల్లి, సిరికొండ మండలాల్లో కోతకు వచ్చిన వరి నేల వాలింది. జుక్కల్, బిచ్కుంద నిజాంసాగర్ మండలాల్లో పంట నష్టం వాటిల్లింది. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్లో అకాల వానలు పసుపు రైతులను ఇబ్బందికి గురిచేసింది. పసుపు అమ్మేందుకు వచ్చిన రైతులకు నష్టం వాటిల్లింది. ఒకట్రెండు రోజుల్లో పసుపును అమ్మేందుకు రైతులు సిద్ధమవుతుండగా పసుపు కుప్పలు వరద నీళ్లలో మునిగిపోయాయి. ఇదిలావుంటే ఇంకా కొన్నిచోట్ల పంటలు కోతకు రాలేదు. విద్యుత్ సరఫరా సరిగా ఉండడం లేదని పలువురు రైతులు వాపోయారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్తు సమస్యలు రోజురోజుకూ మరింత తీవ్రమవుతున్నాయి. ఒకవైపు రాత్రిపూట కరెంట్ సరఫరా చేస్తుండడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతుంటే, మరో వైపు పగటిపూట లో వోల్టేజీ కారణంగా ప్రజలు సతమతమవుతున్నారు. ప్రస్తుతం ఎండలు ముదిరిన తరుణంలో నిరంతర కరెంట్ సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు. గతంలో సుమారు 18 గంటల వరకు త్రీఫేజ్ కరెంట్ సరఫరా చేసే వారు. అయితే, ఇప్పుడది 12 గంటల నుంచి 16 గంటల్లోపే పరిమితం కావడం, మరోవైపు సాంకేతిక కారణాల వల్ల సరఫరాలో తరచూ అంతరాయాలు ఏర్పడుతుండడం సాగుకు ఇబ్బందికరంగా మారిందని రైతులు వాపోతున్నారు. అర్ధరాత్రి 12 గంటలకు కరెంట్ ఇస్తుండడంతో నిద్ర కరువవుతున్నదని చెబుతున్నారు.

# ఒంటిమిట్టలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

## నేటి కళ్యాణోత్సవానికి సిఎం చంద్రబాబు దంపతుల రాక

ఒంటిమిట్ట: ఒంటిమిట్టలోని ప్రసిద్ధ కోదండరామ స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.ఇందులో భాగంగా ఏప్రిల్ 1 బుధవారం రాత్రి ఒంటిమిట్ట సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరగనుంది. ఈ మహోత్సవానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దంపతులు హాజరవుతారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామి వారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సీఎం దంపతులు సమర్పించనున్నారు. కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణం, పురవీధులు రంగురంగుల దీపాలు, ప్రకాశవంతమైన ప్రదర్శన బోర్డులతో అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం తగిన ఏర్పాట్లు చేయడంతో పాటు, పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. మార్చి 26న అంకురార్పణతో ప్రారంభమైన ఈ ఉత్సవాలు ఏప్రిల్ 5 వరకు వైభవంగా జరగనున్నాయి. బ్రహ్మోత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో





తరలివచ్చి స్వామి వారిని దర్శనం చేసుకుంటున్నారు. మంగళవారం ఉదయం మోహిని అలంకారంలో కోదండరాముడు భక్తులకు దర్శనమిస్తున్నాడు. ఇవాళ రాత్రి గరుడ వాహనంపై ఒంటిమిట్ట పురవీధుల్లో స్వామి వారి ఊరేగింపు నిర్వహించనున్నారు.